క్లుప్తంగా

విద్యుత్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు సోమవారం విద్యుత్ తీగలను అమర్చారు. వ్యవసాయ బావులు, బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రైతులు డీడీలు చెల్లించినా పనులలో జరుగుతున్న జాప్యంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ సిబ్బంది, కాంట్రాక్టర్ స్పందించారు. డోర్నకల్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ తీగలతో పాటు పరికరాలను సేకరించి పెరుమాళ్ల సంకీస గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో విద్యుత్ స్తంభాలకు తీగలను అమర్చారు. సాక్షి కథనంతో విద్యుత్ పనులలో కదలిక రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయానికి భూమి విరాళం



గూడూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఆలయం పక్కన గల అరఎకరం ఇంటి స్థలాన్ని యజమానురాలు వేములపల్లి లలితేశ్వరి, కుమారుడు మోహన్‌గుప్త సోమవారం స్థానిక సనాతన శివాలయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బీరం శ్రీపాల్‌రెడ్డి, పెసరి శివ, గాదె సాగర్, నాయిని ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నిరసన

నెహ్రూసెంటర్: గార్ల మండలానికి చెందిన బాదిశ లక్ష్మి తన భూమిని కొందరు కబ్జా చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపింది. న్యాయం చేసి తమ భూమిని ఇప్పించాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు బావోజీ తండా ఆకేరు వాగు సమీపంలో బొడ్డి తండాకు చెందిన మాలోత్ లింగన్న (కిష్టు) గుడుంబా తయారు చేస్తుండగా దాడి చేశామని ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 25 లీటర్ల గుడుంబా, 50 కిలోల నల్లబెల్లం, 5 కిలోల పటిక స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గుడుంబా తయారీకి పాల్పడిన లింగన్నపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

కేసముద్రం: రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని తహసీల్దార్ సాంబశివుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డుల జారీపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నర్సంపేట రోడ్డులోగల మండల్ ప్రజా పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో చోరీ జరిగింది. సోమవారం పాఠశాల హెచ్‌ఎం గుగులోత్ హల్యానాయక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసే సరికి వంటగది తాళం పగులగొట్టి ఉంది. ఒక గ్యాస్ సిలెండర్, రెండు బస్తాల బియ్యం, కుక్కర్, ఐదు కిలోల కందిపప్పు, ఐదు కేసుల కోడిగుడ్లు, ఐదు లీటర్ల వంట నూనె డబ్బా, రెండు కిలోల కారం డబ్బా, పాఠశాల ఆవరణలో బిగించిన నల్లాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గత ఏడాది ఆగస్టు 13న, ఈ ఏడాది మార్చి 15న కూడా చోరీలు జరుగగా టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పుడు కూడా విలువైన వస్తువులు చోరీకి గురికాగా రికవరీ కాలేదు. జరిగిన చోరీ సంఘటనపై పోలీసులు విచారణ జరిపి వంట ఏజెన్సీ వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

కాడెద్దు మృతి



గూడూరు: మండలంలోని రాజనపల్లిలో సోమవారం పంట పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంలో ఓ కాడెద్దు మృతిచెందిన సంఘటన జరిగింది. రైతు జాటోత్ రఘు, సర్పంచ్ కొడుకు చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేత కోసం వెళ్లిన ఎద్దు గ్రామంలోని నల్లాల బావి విద్యుత్ మోటర్ సరఫరా కొద్దిదూరంలో ఓ రైతు పంట పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో చనిపోయిందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన రైతు జాటోతు రవికి విద్యుత్ శాఖ తరుపున రూ. 60 వేలు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు.

ఘనంగా పుస్తక పఠనోత్సవం

గార్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక పఠనోత్సవం కార్యక్రమాన్ని సోమవారం హెచ్‌ఎంలు ప్రారంభించారు. గోపాలపురం హైస్కూల్లో పుస్తక పఠనోత్సవం కార్యక్రమంను ఎంఈఓ బి.ఫూల్‌చంద్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పుస్తక పఠనోత్సవం కార్యక్రమం జూలై 31 వరకు కొనసాగించాలని సూచించారు. ప్రతీ రోజు పుస్తక పఠనోత్సవం కోసం ఒక పీరియడ్ కేటాయించి, ఆ పీరియడ్‌లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులచే ధారాళంగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామచంద్రు, ఉపాధ్యాయులు శివ, భాస్కర్‌రావు, వీరభద్రం, వీరస్వామి, రాజేశ్వరి, బుచ్చా, వీరన్న, రాము, సీఆర్‌పీ ఉపేందర్, వీరు తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలుగా తయారు చేయడమే లక్ష్యం

నెల్లికుదురు: విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించి పిల్లలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పఠన దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 31 వరకు కొనసాగుతుందన్నారు.

డోర్నకల్: మండలంలోని చిలుకోడు ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎం తలారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. నిత్యం పుస్తక పఠనంతో విద్యార్థులలో అభ్యసన, జ్ఞాపకశక్తి పెరుగుతుందని హెచ్‌ఎం విద్యాసాగర్ తెలిపారు.

నర్సింహులపేట: మండలంలోని అన్ని పాఠశాలల్లో అయా హెచ్‌ఎంలు రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తారు. మండలంలో పఠనోత్సవం ప్రారంభించారు.



గార్ల: గోపాలపురం హైస్కూల్లో పఠనోత్సవాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో పఠనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకములు, గ్రంథాలయ పుస్తకములతో పాటు కథల పుస్తకములు, దినపత్రికలు, మ్యాగజిన్‌లు వంటివి చదివించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయ్ రాజ్, ఉపాధ్యాయులు కొలిపాక శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సామర్థ్యాలను పెంపొందించాలి

పెద్దవంగర: విద్యార్థులకు పఠన సామర్థ్యాలను పెంపొందించాలని పఠనోత్సవ రాష్ట్ర బృందం ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పఠనోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు అనిల్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్ అల్లందాసు భిక్షపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పఠనంతో మేథాశక్తి పెంపు



పెద్దవంగర: అవుతాపురంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం



చిన్నగూడూరులో..

మహబూబాబాద్ రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని కంబాలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రమేష్ బాబు అన్నారు. కంబాలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పుస్తక పఠనం నిర్వహించారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం పాఠశాల హెచ్‌ఎం పూజారి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ జి.రాంబాబు సమక్షంలో ఘనంగా పుస్తక పఠనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘువేందర్, లలిత, జబ్బరుల్లాబేగ్, యాదగిరి, భిక్షపతి, లక్ష్మా, విజయచందర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ రాము మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో శక్తి సామర్థ్యాలు వెలికి వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసుదన్‌రావు నోడల్ అధికారి బుధారపు శ్రీనువాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో..



నెల్లికుదురు ప్రభుత్వ పాఠశాలలో..



కురవి: గుండ్రాతిమడుగులో..

గౌడ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

నెహ్రూసెంటర్: జిల్లాలో పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన గౌడ విద్యార్థులకు జిల్లా గోపా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డ్స్ అందజేస్తున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్, కోశాధికారి ముక్తేశ్వర్ సోమవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీన జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి ప్రతిభ అవార్డ్స్ అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 99890 09299, 94405 14666, 99892 30056 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నగూడూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆకేరు వాగు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇద్దరు ట్రాక్టర్ ఓనర్లు, ఒక డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్‌షాపుల్లో సన్నబియ్యం అందించాలి

కేసముద్రం: రేషన్‌షాపుల ద్వారా పేదప్రజలకు సన్నబియ్యాన్ని అందించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సయ్య, భాస్కర్, రవి, గాజుల ఉపేందర్ పాల్గొన్నారు.

సొంత పార్టీలోనే శత్రువులున్నారు..

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి: 'నాకు మొదటి నుంచి సొంత పార్టీలోనే శత్రువులున్నారు.. నాకు ఎదురుగా ప్రతిపక్షం లేదు.. ఎప్పుడూ స్వపక్షంలోనే విపక్షం ఉంది' అని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సోమవారం కురవి, సీరోలు మండలాలకు చెందిన అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం ఎంపీపీ గుగులోత్ పద్మావతిర వినాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మనస్సు పెట్టి బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. సీఎం కేసీఆర్ సీఎం అయ్యాక తెలంగాణలోని అన్నిగ్రామాలు అభివృద్ధి జరిగాయని వివరించారు. త్వరలో కురవి, సీరోలు మండలాల్లోని గ్రామాల్లో ప్రచారం చేయడం జరుగుతుందని తెలిపారు. తనకు మొదట మర్రి చెన్నారెడ్డి టికెట్ ఇచ్చాడని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ స్పష్టం చేశారు. ధైర్యంగా, నీతి నిజాయితీ, అవినీతి చేయకుండా వెళితే ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. నాకంటే ఎక్కువ సేవ చేసే వ్యక్తి ఎవరు ఉన్నారని, ఓటు అడిగే హక్కు నాకే ఉందని, సేవకు మారు పేరు రెడ్యానాయక్ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు గార్లపాటి వెంకటరెడ్డి, కొండపల్లి శ్రీదేవి, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ బజ్జూరి జ్యోత్స్నవెంకటరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ బజ్జూరి ఉమపిచ్చిరెడ్డి, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, ఆర్‌బీఎస్ మండల కో-ఆర్డినేటర్ ముండ్ల రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ సరస్వతీ, తహసీల్దార్‌లు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

బంద్ విజయవంతం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అడ్డుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్‌ను విజయవంతం అయిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అచ్చు సుజిత్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సోమవారం బంద్‌ను ఏబీవీపీ నిర్వహించారు. ఈసందర్భంగా సుజిత్ మాట్లాడుతూ. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా అధిక ధరలకు బుక్స్, ఫీజులు, యూనిఫామ్‌ం అడ్డుఅదుపు లేకుండా విచ్చలవిడిగా అమ్ముతున్నారని, ప్రశ్నించిన విద్యార్థి సంఘాల నాయకులపై పలు కేసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండలంలో అఖిల భారత విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. ఈసందర్భంగా ఏబీవీపీ కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో కనీస మౌలిక సదుపాయాలైనా పాఠ్యపుస్తకాలు, లైబ్రరీ, గ్రంథాలయం వంటి సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని, ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై నియంత్రణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు విజయ్‌కుమార్, వెంకన్న, అరవింద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కేవులా తండా ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు రూరల్ సీఐ బి.రమేష్, ఎస్సై బి.రాంచరణ్ సోమవారం స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఎస్సై సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. సర్పంచ్ బాలు, కార్యదర్శి వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

గార్ల: మండలంలోని సూర్యాతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గార్ల సీహెచ్‌సీ వైద్యులు రాజ్‌కుమార్ జాదవ్ సోమవారం స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, ఫార్మసిస్ట్ సుందర్‌లాల్, ఏఎన్‌ఎం తార, హెచ్‌ఎం కిషోర్, సరిత పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన సీఐ రమేష్, ఎస్సై రాంచరణ్


క్రీడలతోనే బంగారు భవిష్యత్



బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులకు క్రీడలతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ముల్లంగి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రౌండ్‌లో జూనియర్ బాస్కెట్‌బాల్ ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 28, 29 తేదిలో హైదరాబాద్‌లో జరిగే 7వ రాష్ట్రస్థాయి జూనియర్ టోర్నమెంట్‌లో మానుకోట జిల్లా బాలుర జట్టు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో కోచ్ వెలిశాల కుమారస్వామి, అసోసియేషన్ సభ్యులు వంగ రమణ, మెగిలి ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మూడెకరాల భూమి పంపిణీ చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న రాజన్న, రామ్మూర్తి

మహబూబాబాద్ రూరల్: ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బలరాంతండా, అమనగల్, సోమ్లా తండా, సాదుతండా, మల్యాల గ్రామపంచాయతీలలో ఎస్సీ, ఎస్టీలు బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు అనేక అంశాలను తమ దృష్టికి తీసుకొచ్చారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు, వాగ్దానాలు మండలంలో అమలు కావట్లేదన్నారు. కార్యక్రమంలో ఇస్లావత్ జోగియా నాయక్, ధర్మారపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలి

నెహ్రూసెంటర్: కల్తీ విత్తనాలను, ఎరువులను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కె.శశాంకకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాస వెంకటనారాయణ, జి.సక్రు, ఆలకుంట్ల సాయిలు, ఎస్‌కె బాబన్న, సమ్మన్న, వీరభద్రం, భిక్షపతి, శ్రీను, కృష్ణ, యాకన్న, సురేష్, జ్యోతి, సునీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడ: నకిలీ విత్తనాలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నగేష్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని విత్తనాల షాపులను తనిఖీ చేశారు. 1001 రకం విత్తనాల విక్రయాలు చేయవద్దని అన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బయ్యారం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బయ్యారం: పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులతోపాటు ఇటీవల రిటైర్ అయిన బకాయిలు అన్ని ఒకేసారి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతప్రసాద్, వెంకట్ రెడ్డి, సాంబశివరావు, సుబ్బారావు, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట విశ్రాంత ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి గార్ల, బయ్యారం మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుడి రాంప్రసాద్ మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వీరన్నకు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గట్టు అనంతరాములు, జవ్వాజి నరసింహరావు, వడ్లమూడి శ్రీనివాస్, జక్కుల పాండురంగారావు, వెంకటేశ్వర్లు, సునీల పాల్గొన్నారు.

కేసముద్రం: పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సాంబశివుడుకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సోమయ్య, బుచ్చిరెడ్డి, వీరమల్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వరకట్న వేధింపులపై కేసు

గార్ల: భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వివరాలిలావున్నాయి. గార్ల మండలం రాజుతండా పంచాయతీ ఎర్రమట్టితండాకు చెందిన భూక్యా జ్యోతిని, డోర్నకల్ మండలానికి చెందిన భూక్యా దస్రాంతో 8నెలల క్రితం వివాహం జరిగింది. 3నెలల నుంచి భర్త, అత్తమామలు నాగమణి, మంగ్యాలు జ్యోతిని అదనపు కట్నం తీసుకురమ్మంటూ శారీరకంగా, మానసికంగా తరచూ వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో జ్యోతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు విచారించిన ఎస్సై భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ముస్లిం విద్యార్థులకు వరం

మహబూబాబాద్ అర్బన్: ముస్లిం విద్యార్థులకు మైనార్టీ కళాశాల ఒక వరమని మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇమాముద్దిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ కళాశాలలో సోమవారం నూతనం మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన వారి పుస్తకాలను ప్రిన్సిపాల్ అందజేశారు.

నలుగురిపై కేసు నమోదు

గార్ల: భూవివాదంలో జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపారు. వివరాలిలావున్నాయి. గార్ల మండలం ముల్కనూరు పంచాయతీ గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన గూగులోత్ విజయ, భర్త లక్ష్మణ్ లపై భూమి పంపకాల వద్ద గూగులోత్ రాంచందర్, శైలజ, కౌంసల్య, దిలీప్‌లు దాడి చేశారు. ఈదాడిలో గాయపడిన గూగులోత్ విజయ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు విజయపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువు తూము పరిశీలన

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామ పరిధిలో గల పెద్ద చెరువు తూమును డీఈ పుట్టయ్య పరిశీలించారు. సోమవారం గ్రామంలో పెద్ద చెరువును సందర్శించి నూతన తూము ఏర్పాటుకు ఏఈ అలేఖ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మురళీధర్ రెడ్డి, కృష్ణ ఉన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మంగీలాల్

కురవి: ఎల్‌హెచ్‌పీఎస్ డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కురవికి చెందిన గుగులోత్ మంగీలాల్ నాయక్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో ప్రకటించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య కోటియా నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ బీమా నాయక్, ఉపాధ్యక్షుడు బిక్షంనాయక్, బానోత్ రమేష్‌నాయక్, వినోద్ నాయక్‌లు మంగీలాల్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

కురవి: గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించకుండా జీఓ 25ను విడుదల చేశారని, వెంటనే జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సార్కె రామయ్య, పాసిన మల్లయ్య, సుశీల, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీతంపై ప్రచారం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల అనుగ్రహంతో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞాన వేధిక మహబూబాబాద్, జమ్మికుంట, గుండెపూడి కమిటీల ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతంపై ప్రచారం నిర్వహించారు. ఇందూ జ్ఞాన వేధిక సభ్యులు కృష్ణవేణి, వెంకటాచార్యులు, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

నర్సింహులపేట: మండలంలోని నర్సింహులపేట సీపీఎస్, బస్తారాంతండా, బంజరతండా పీఎస్‌లు, పడమటిగూడెం యూపీఎస్‌ను సోమవారం నోడల్ హెచ్‌ఎం టి.శ్రీలత తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతంను పెంచాలని, సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సక్రమంగా పని చేయని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవన్నారు. సీఆర్‌పీ శేషుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యుడిగా మహమూద్‌ఖాన్



నెహ్రూసెంటర్: ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మానుకోట జిల్లా కేంద్రంలోని కొండపల్లి గోపాల్‌నగర్ కాలనీకి చెందిన ఎండి మహమూద్‌ఖాన్ ఎంపికయ్యారు. ఈనెల 24, 25 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

తొర్రూరు రూరల్: కుట్టు శిక్షణతో మహిళలు కుటుంబానికి బాసటగా నిలవచ్చని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్‌లు అన్నారు. మండలంలోని అమ్మాపురం గ్రామ రైతు వేదికలో సెర్ప్, స్త్రీ నిధి సంస్థల ఆధ్వర్యంలో రెండో విడత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని భర్తరఫ్ చేయాలి



మహబూబాబాద్ రూరల్: ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) మండల అధ్యక్షుడు కోల గంగరాజు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామంలో సోమవారం కౌశిక్‌రెడ్డి చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన తెలిపి దహనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల సత్యం, మాజీ సర్పంచ్ దుండి శ్రీనివాస్, ముదిరాజు సంఘం అధ్యక్షుడు పులుగుజ్జు ఉప్పలయ్య, కోల వీరన్న, బీసు రవి, గుడిసె రాజశేఖర్ పాల్గొన్నారు.